

ఏనుగుల వరుస దాడులతో ఆందోళన


ఏనుగులు తొక్కేసిన కంచెను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, నారావారిపల్లి సమీపంలోని బీమవరం, కందులవారి పల్లి, చిన్న రామాపురం, ఎల్లంపల్లి, కూచువారి పల్లి, కొండ్రెడ్డి కండ్రిగ గ్రామాలలో కొంత కాలంగా ఏనుగులు పంట పొలాలపై దాడి చేస్తున్నాయి. రైతులు పంటను కాపాడడంలో నిద్రలేకుండా అవస్థలు పడుతున్నారు. నాగపట్ల వెస్ట్ బీట్ పరిధిలో తిష్ట వేసిన 9 ఏనుగులు సోమవారం తెల్లవారుజామున కొండ్రెడ్డి కండ్రిగ, మూలపల్లి గ్రామాలలోకి అర్ధరాత్రి వచ్చి పంటపొలాలను ధ్వంసం చేసాయి. కూచివారిపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయం వెనుక ఇనుప గేటును తొక్కుకుంటూ గజరాజులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో గ్రామస్తులను చంద్రగిరి ఎమ్మెల్యే నాని పరామర్శించారు. ఏనుగులను దారి మళ్లించాలని ఫారెస్ట్ అధికారులకు సూచించారు.

తుపాను నేపథ్యంలో ముందస్తు చర్యలు


తిరుపతిలో మ్యాన్ హోల్స్‌ను పరిశీలిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తుపాను నేపథ్యంలో నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సోమవారం సాయంత్రం లక్ష్మీపురం సర్కిల్, పార్వతిపురం, ప్రగతి నగర్, నారాయణపురం, కొత్తపల్లి, కొరమేను గుంటలోని అండర్ బ్రిడ్జిలను, మురుగునీటి కాలువలను అధికారులతో కలిసి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. మురుగునీటి కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని, అండర్ బ్రిడ్జిల వద్ద మోటార్ల ద్వారా నీరు పంపింగ్ చేయాలని, మ్యాన్ హోల్స్ పై మూతలు ఉంచాలని అధికారులను ఆదేశించారు.

విద్యుత్ శాఖ అప్రమత్తం



- ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్ర మత్తంగా వుండాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో తుఫాను ప్రభావం ఎక్కువగా వుండే జిల్లాల్లో అధికా రులు, సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరా యం ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమిం చినట్లు తెలిపారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉన్న ఎపిఇపిడిసిఎల్ పరిధిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల కోసం 124 బృందాలు తరలి వెళ్ళాయని తెలిపారు. ఎపిఇపి డిసిఎల్ కు అవసరమైన విద్యుత్ పరికరాలను కూడా తరలిం చినట్లు వివరించారు. సంస్థ పరిధిలో సర్కిల్స్, డివిజన్స్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేసి అత్యవసర సమాచారం అందించాలని సూచించారు. వాట్సాప్ నంబరు: 9133331912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల తహసిల్దార్ శ్రీదేవి తుపాను నేపథ్యంలో బుచ్చినాయుడు కండ్రిగ మండల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మూడు రోజుల పాటు వీఆర్వోలు, వీఆర్ఏలు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని తెలియజేశారు.

ప్రజాశక్తి -దొరవారిసత్రం :తుపాన్ నేపథ్యంలో సోమవారం మండల పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన,


లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న తహశీల్దార్ శైలకుమారి

తనయాలి, పూలతోట, కారికాడు, ఏలికాడు, మీజూరు గ్రామాలను తహశీల్దార్ శైలకుమారి సందర్శించారు. తనయాలి వద్దఉన్న కాళంగి నది, పూలతోట వద్ద ఉన్న కన్నా కాలవ ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 9553285452 నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. వీరివెంట ఏంపిడిఓ గోవర్ధన్, యస్ఐ అజయ్ కుమార్, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల రెవెన్యూ తహశీల్దార్ మధుసూదన్ రావు సూచించారు. సోమవారం వీకే పల్లి, రాయలచెరువు, కుప్పం బాదురు, అనుపల్లి, ఎన్ ఆర్ కమ్మపల్లి, బ్రాహ్మణ కాలవ, కే కే వి పురం, నెన్నూరు, గ్రామాలలో ఎస్సై భక్తవత్సలం, ఇరిగేషన్ ఏఈ ఎత్తిరాజులు, ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈఓ మార్కండేయ నాయుడు, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ పవన్ రాజు, హౌసింగ్ ఏఈ మహేష్ నాయుడు పర్యటించి గ్రామాలలో లౌడ్ స్పీకర్లు , దండోరాల ద్వారా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్త పట్ల అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9491077030కు సమాచారం ఇవ్వాలన్నారు.

రాయల చెరువుకు వరదనీరు.. పెరిగిన నీటిమట్టం



గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన రాయల చెరువుకు.. అనుపల్లి చెరువు నుండి, పెద్దేటి వంక ద్వారా వరద నీరు చేరుతోంది. దీంతో రాయలచెరువు నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. తుపాన్ నేపథ్యంలో రాయలచెరువును చూసేందుకు ఎవరు రాకూడదని పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

పల్లెల్లో అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-ఏర్పేడు:తుపాను నేపథ్యంలో అధికారులు సోమవారం పల్లెల్లో పర్యటించారు. ఇసుక తాగేలి పంచాయతీలో మురికినీటి సమస్యపై ఆరా తీశారు. అనంతరం సదాశివ కోన రిజర్వాయర్‌లో నీటిమట్టాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యమ్మ, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ జయకుమార్, టిడిపి మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ ఇబ్బందులను అధిగమించాలి

ప్రజాశక్తి - కేవిబి పురం: తుఫాన్ ఇబ్బందులను మండలంలో అందరి సమన్వయంతో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, అందుకు ప్రతి శాఖ అధికారి సమన్వయంతో పనిచేసి సహకరించాలని కేవిబి పురం మండల తహశీల్దార్ రోశయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. వరదయ్యపాలెం, గోవర్ధనపురం సిఎల్ఎన్ పల్లి, కదూరు కూడలి, పెద్ద పాండూరు, ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందని ఆ ప్రాంతంలో అత్యవసర సేవల కోసం ట్రాక్టర్లు, జేసీబీలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మాలతి, ఎంఈఓ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట:తుఫాన్ నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారి కోట తహశీల్దార్ కే. జే జే రావు, సైక్లోన్



ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ డిఈఈ చంద్రశేఖర్ సోమవారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారులకు తుపాను నేపథ్యంలో తీసుకోవాల్సి జాగ్రత్తలను సూచించారు. అనంతరం కొత్తపట్నం, దైవాలదిబ్బ ప్రాంతాలను పరిశీలించారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు తెలిపారు.

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని చిన్న సింగమాల పంచాయతీలో సోమవారం తొట్టంబేడు మండలం టీడీపీ మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు పర్యటించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్‌ను ఎదుర్కోటానికి అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

పుత్తూరు మున్సిపాల్టీ అలర్ట్.. హెల్ప్‌లైన్ నంబర్లు విడుదల

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మండలంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. పుత్తూరు మున్సిపాలిటీ కమిషనర్ మంజునాథ్ గౌడ ఒక ప్రకటనలో విడుదల చేస్తూ అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్ నంబర్లను 70750 67503, 79899 95876 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాగులు, వంకలు, పొంగిపొర్లు కల్వర్టుల దగ్గర జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

కుంగిన కల్వర్టు.. సదాశివకోనకు రాకపోకలు బంద్

భారీ వర్షాల ప్రభావంతో సదాశివకోనకు వెళ్లే రహదారి తీవ్రంగా దెబ్బతింది. విఎస్ పురం నుంచి సదాశివుని ఆలయానికి వెళ్లే మార్గంలో ఉన్న మట్టి కల్వర్టు వర్షపు నీటితో కుంగిపోవడంతో భక్తులు తీవ్ర


కుంగిన కల్వర్టు

ఇబ్బందులు పడుతున్నారు. కార్తీకమాసం కావడంతో శివుని దర్శించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. అయితే రహదారి బురదమయమై, కల్వర్టు కుంగిపోవడంతో అనేక మంది భక్తులు మధ్యలోనే వెనుదిరిగారు. మూలకోన జలపాతం మార్గంలో నీటి ప్రవాహం పెరగడంతో అటవీశాఖ అధికారులు భద్రతా కారణాల దృష్ట్యా భక్తులు, పర్యాటకులు ఆ ప్రాంతానికి వెళ్లకూడదని సూచిస్తూ ప్రవేశం నిషేధం బోర్డులు ఏర్పాటు చేశారు.

కలుజు వద్ద అక్రమంగా నిర్మించిన గోడ కూల్చివేత

ప్రజాశక్తి - రేణిగుంట : కుర్రకాల్వ కలుజు వద్ద నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించడానికి కాంపౌండ్ వాల్‌ను జెసిబి సహాయంతో కూల్చేశామని తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వర్షాల నేపథ్యంలో కుర్రకాలువ చెరువు కలుజు వద్ద నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను తొలగించడంతో చెరువులో నుండి నీరు లోతట్టు ప్రాంతాలకు సునాయసంగా వెళ్లిపోయాయి. కుర్ర కాలువ సర్వేనెంబర్ 28 భూమి ట్యాంకు పోరంబోకుగా రెవెన్యూ రికార్డులలో నమోదు చేయబడిందని తహశీల్దారు తెలిపారు.

రేణిగుంట మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, మామండూరు అటవీ ప్రాంతం, మల్లేమడుగు రిజర్వాయర్‌లకు సందర్శకులను అనుమతించరాదని తహశీల్దారు చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 8328336598 కు సంప్రదించలని తెలిపారు.

కొటాల బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే పులివర్తి నాని



ప్రజాశక్తి - చంద్రగిరి: కురుస్తున్న వర్షాలకు చంద్రగిరి మండలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నాని నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిచే అవకాశం ఉన్నందున, చంద్రగిరి మండలంలోని కొట్టాల బ్రిడ్జిని ఎమ్మెల్యే పులివర్తి నాని పరిశీలించారు. తుపాను నేపథ్యంలో ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని కూటమి నాయకులకు, కార్యకర్తలకు తెలిపారు.

సియోల్‌లో శ్రీసిటీ బృందం



ప్రజాశక్తి - సత్యవేడు: విదేశీ పెట్టుబడులు, వ్యాపార విస్తరణలో భాగంగా శ్రీసిటీ మార్కెటింగ్ బృందం కొరియాలో పర్యటించింది. ఈ సందర్భంగా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ నేతృత్వంలో సియోలలోని భారత రాయబార కార్యాలయం డిప్యూటీ మిషన్ చీఫ్ నిషికాంత్ సింగ్, జపాన్ ఉన్నతాధికారులను కలిసి, ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామిక ప్రగతి, 31 దేశాలకు చెందిన 240కు పైగా పరిశ్రమలను ఆకర్షించడంలో శ్రీసిటీ కీలక పాత్రను హైలైట్ చేశారు. ఎల్జీ, సోలుమ్, హ్యుందాయ్ ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ ఎస్కే ఫ్యుకోర్, ఎల్జీ పాలిమర్స్ వంటి ప్రముఖ కొరియన్ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వారికి వివరించారు. అలాగే సియోల్‌లో జరిగిన కొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్, ఐటీ ప్రదర్శన (కెఈఎస్ 2025) ను సందర్శించారు. కొరియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ అధికారులు, ఇతర వ్యాపార సమూహాలతో వ్యూహాత్మక సమావేశాలు నిర్వహించి, పెట్టుబడి భాగస్వామ్య అవకాశాలను చర్చించారు. శ్రీసిటీ వేగవంతమైన పురోగతిని ప్రశంసించిన నిషికాంత్ సింగ్, భవిష్యత్ కొరియా పెట్టుబడులకు తన మద్దతు తెలిపారు. ఈ పర్యటన శ్రీసిటీ, కొరియన్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలపరుస్తుందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

వర్సిటీలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


యస్వీయు నూతన విసిని సత్కరిస్తున్న సిఐటియు నాయకులు సామల జయచంద్ర తదితరులు

ప్రజాశక్తి - క్యాంపస్ :యస్వీయులో అవుట్సోర్సింగ్, ఎన్ఎంఆర్, టైం స్కేల్, అకడమిక్ కన్సల్టెంట్ల పలు రకాల సమస్యలను పరిష్కరించాలని, సిఐటియు జిల్లా అధ్యక్షులు సామల జయచంద్ర డిమాండ్ చేశారు. గత సంవత్సరకాలంగా ఇన్చార్జి పాలనలో వర్సిటీలో ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆరోపించారు. నూతన విసిగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య టాటా నర్సింగరావును సోమవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు జయచంద్ర, వర్సిటీల కాంట్రాక్టు వర్కర్స్ సంఘం గౌరవాధ్యక్షులు గండికోట నాగ వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీలో 10, 15 సంవత్సరాలకు పైగా పని చేస్తున్న ఔట్సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఉద్యోగుల ఆర్థిక పరిస్థితులను గుర్తించి ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి వేతనాలను పెంచాలని వీలైతే శాశ్వత ఉద్యోగులుగా మార్పు చేసే విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. అలాగే ఇన్చార్జి పాలనలో పర్మామెన్స్ రివ్యూ పేరుతో తొలగించిన అకడమీక్ కన్సల్టెంట్ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, అకడమీక్ క్యాలెండర్‌ను సకాలంలో నిర్వహించి వర్సిటీకి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కలెక్టర్ జీవో ప్రకారం వేతనాలు రోజుకి 650 రూపాయలు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని కోరారు. వర్కర్స్ అందరికీ పనిముట్లు, యూనిఫామ్, ఇతర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వర్క్ కాంట్రాక్ట్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్ర, మురగయ్య, కోశాధికారి గణేష్, కమిటీ సభ్యులు సుమతమ్మ, మీనా, ధరణి, కళావతి, రాధమ్మ , కృష్ణవేణి, సెల్వి, రవి, వెంకటస్వామి, ముని, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పరకామణి చోరీ కేసును..

- సీఐడీతో పాటు ఏసిబికి అప్పగించాలి : ఏ.పి హైకోర్టు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి పరాకమణి చోరీ కేసును హైకోర్టు సీఐడీతో పాటు ఏసీబీకి అప్పగించింది. రవికుమార్ అనే ఉద్యోగి దొంగతనం చేస్తూ పట్టుబడితే.. ఆ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేశారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ అంశంపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అసలు పరకామణి చోరీ కేసును ఎలా రాజీ చేశారు.. దీని వెనుక ఎవరు ఉన్నారు.. నిబంధనలకు విరుద్ధంగా ఎందుకు రాజీ చేశారు.. దీని వెనుక లోగుట్టేమిటో తేల్చాలని సీఐడీని ఆదేశించింది. అలాగే రవికుమార్‌కు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, ఆస్తుల లావాదేవీలు, ఎంత కాలం నుంచి దొంగతనాలు చేశారు.ఆయన ఆస్తులు ఎవరెవరి పేరు మీదకు మారాయన్న అంశంపై దర్యాప్తు చేయాలని ఆదేశించింది. సీఐడీ, ఏసీబీలు దర్యాప్తును పూర్తి చేసి తదుపరి విచారణ అంటే డిసెంబర్ 2వ తేదీ కల్లా నివేదికలను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. డీజీ స్థాయి అధికారి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా ఉండాలని స్పష్టం చేసిది. భక్తులు ఎంతో భక్తితో సమర్పించిన కానుకల్ని ఉద్యోగి దొంగతనం చేస్తే అతని వద్ద కొన్ని ఆస్తుల్ని టీటీడీకి రాయించి రాజీ చేయించడం అనుమానాస్పదంగా ఉండటంతో హైకోర్టు సీరియస్‌గా తీసుకుంది.

ధోనీని కలిసిన ఎమ్మెల్యే బొజ్జల



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టీమిండియా మాజీ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సోమవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధోనీకి శ్రీకాళహస్తీశ్వరాలయ విశిష్టతను బొజ్జల వివరించారు. త్వరలో ముక్కంటి దర్శనార్థం రావాలని ఆహ్వానించారు.

బండారు దత్తాత్రేయకు సత్కారం


బండారు దత్తాత్రేయను సత్కరించి జ్ఞాపికను అందిస్తున్న జబ్బల శ్రీనివాసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ గవర్నరు బండారు దత్తాత్రేయను సౌత్ ఇండియా ఓబీసీ అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించారు. ఓబీసీ సెమినార్ కార్యక్రమాల వివరాలను ఈ సందర్భంగా ఆయనకు శ్రీనివాసులు వివరించారు. ఓబీసీ జాతీయ నేత, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌ను కలసి ఓబీసీ రిజర్వేషన్లపై మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ నాయకుడు గుజ్జ కృష్ణ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు భూపేష్ సాగర్, విద్యార్థి సంఘం నాయకుడు రామకృష్ణ, బిసి సోదరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం..!!

మృత శిశువుకు జన్మనిచ్చిన గిరిజన మహిళ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఓ గిరిజన మహిళ మృత శిశువుకు జన్మనిచ్చిన సంఘటన శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో సోమవారం చోటు చేసుకుంది. సకాలంలో కాన్పు చేయక పండంటి మగ బిడ్డను కోల్పోయామని బంధువులు ఆరోపించగా, గర్భంలోనే బిడ్డ చనిపోయాడంటూ వైద్యులు వివరణ ఇవ్వడం గమనార్హం. వివరాల్లోకి వెళితే పట్టణంలోని కైలాసగిరి కాలనీలో నివాసం ఉంటున్న బండి వెంకటేష్, చెంచమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. చెంచమ్మ మూడో సారి గర్భం దాల్చడంతో కాన్పు నిమిత్తం సోమవారం ఉదయం స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఆమె మృత మగ శిశువుకు జన్మనిచ్చింది. అయితే సకాలంలో కాన్పు చేయకపోవడం వల్లే బిడ్డ చనిపోయాడంటూ బంధువులు ఆరోపించారు. చెంచమ్మను పురిటినొప్పులతో ఆసుపత్రి అత్యవసర విభాగంలోకి తీసుకెళ్లగా అక్కడి సిబ్బంది కాన్పుల వార్డుకు అడ్మిషన్ ఇవ్వకుండా ఓపీ వార్డుకు పంపారని చెప్పారు. అక్కడ క్యూ లైన్లో ఓపీ తీసుకోవడం, ఓపీ విభాగంలో డాక్టర్ పరిశీలించాక అక్కడ నుంచి కాన్పుల వార్డుకు తరలించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే ఆలస్యం జరిగి ఉమ్మనీరు పోయి తమ బిడ్డ చనిపోయి ఉంటుందని ఆరోపించారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ మణిని వివరణ కోరగా కాన్పుకు వచ్చిన గర్భిణీ పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని చెప్పారు. వారం రోజుల కిందటే గర్భంలోనే బిడ్డ చనిపోయాడనీ, ఈ రోజు మృత శిశువుకు జన్మనిచ్చినట్లు వివరించారు. రక్తహీనత, ఇన్ఫెక్షన్ తో బాధపడుతున్న తల్లిని కాపాడేందుకు తాము చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంతో

మరింత నైపుణ్యమైన బోధన


ఆన్లైన్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, కాన్సెప్ట్ టూల్స్, ఎమర్జింగ్ అప్లికేషన్స్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను ప్రారంభించిన చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కళాశాలలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఎంతగానో దోహదపడుతుందని, దీని ద్వారా నైపుణ్యతతో కూడిన బోధన విద్యార్థులకు అందించే అవకాశం లభిస్తుందని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం కళాశాలలో 6 రోజుల పాటు ఏఐసిటిఈ, అటల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహింపబడే ఆన్లైన్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, కాన్సెప్ట్ టూల్స్, ఎమర్జింగ్ అప్లికేషన్లు అనే అంశాలపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ తేజ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ పటేల్ మాట్లాడుతూ ఈ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా అధ్యాపకులకు మంచి నైపుణ్యత పరిజ్ఞానం, నూతన మార్పులు తెలుసుకొనే అవకాశం ఉందన్నారు. ఏఐ టెక్నాలజీతో ప్రపంచంలో విద్యా ఉపాధి రంగాల్లో విశేషమైన మార్పులు వస్తున్నాయని, ఈ తరుణంలో అధ్యాపకులకు ఈ ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దేశవ్యాప్తంగా 480 మంది అధ్యాపకులు ఈ ఆన్లైన్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంకు హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమం ఆన్‌లైన్‌లో ఘనంగా ప్రారంభమైంది. ప్రధాన అతిథులుగా డా. చదలవాడ కృష్ణమూర్తి, చైర్మన్, కృష్ణ తేజ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్, చదలవాడ నగర్, రెణిగుంట రోడ్, తిరుపతి మరియు డా. భాస్కర్ పటేల్, డైరెక్టర్, కృష్ణ తేజ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ సభ్యులు వరుణ్ సాయి, సాహితి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.


పల్లె వెలుగు బస్సులో హౌసింగ్ ఏఈ వీరంగం



పోలీస్ స్టేషన్‌లో కండక్టర్ ఫిర్యాదు

ప్రజాశక్తి - బాలాయపల్లి : హౌసింగ్ ఏఈ పల్లె వెలుగు బస్సులో వీర రంగంచేయడంతో బాలాయపల్లి పోలీసులకు కండక్టర్ కస్తూరమ్మ అప్పగించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. కండక్టర్ తెలిపిన వివరాల మేరకు వెంకటగిరి గృహ నిర్మణశాఖలో ఏఈగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం వెంకటగిరి నుండి గూడూరుకి వెళ్లేందుకు బస్సు ఎక్కి, తన పక్కన సీటులో కూర్చున్నాడని తెలిపారు. తను వేరే సీటులో కూర్చోమని కోరగా, నేను ప్రభుత్వ ఉద్యోగిని నీ అంతు చూస్తా నన్నే లేపతావా మీ డీపో మేనేజర్ నెంబర్ ఇవ్వు అంటు ఫోనులో ఫోటోలు తీశాడని తెలిపారు. ఎందుకు ఫోటోలు తీశావు డిలేట్ చేయి అన్నందుకు తనను దూషిస్తూ.. నేను కాళహస్తి హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌ని అంటు ప్రయాణికులపై కూడా తిరగపడ్డాడని తెలిపారు. దీంతో బాలాయపల్లి పోలీసు స్టేషన్ వద్ద బస్సు నిలిపి పోలీసులకు పిర్యాదు చేశానని తెలిపారు. ఎస్ఐ గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

విద్యుత్ మీటర్ రీడర్స్‌ని ఆదుకోండి


ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్‌కు ఏఐటీసీ నాయకుల వినతి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్‌ని ఏఐటీసీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐటియుసి నాయకులు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థని నమ్ముకొని గత 20 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న మీటర్ లీడర్స్‌కు ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నెలవారి వేతనాలు అమలు చేయాలన్నారు. ఎస్పీడీసీఎల్ జిల్లా పరిధిలో కాంట్రాక్టర్లు కొంతకాలంగా మీటర్ లీడర్స్‌కు పీస్ రేటు పూర్తిగా అమలు చేయకుండా బినామీ పేర్లతో ఈఎస్ఐ కడుతూ మీటర్ లీడర్స్ కడుపు కొడుతున్నారని ఆరోపించారు. చీఫ్ సెక్రటరీ, ఇంధన శాఖ కార్యదర్శి విజయ్ ఆనంద్ ఇచ్చిన ఎస్క్రో అకౌంట్ ద్వారా చెల్లించాలని అలాగే స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో మీటర్ రీడర్స్‌కు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రామకృష్ణ రాష్ట్ర కోశాధికారి రమేష్ ఎస్పీడీసీఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, ఉమ్మడి 5 జిల్లాల మీటర్ రీడర్స్ నాయకులు పాల్గొన్నారు.

భాను ప్రకాష్ రెడ్డికి మద్దతిస్తాం

- జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు బత్తెన మధుబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత ప్రభుత్వ హాయంలో టిటిడిలో జరిగిన అవినీతిపై పోరాడుతున్న టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డికి ఈ పోరాటంలో తామంతా మద్దతుగా నిలుస్తామని, కూటమి ప్రభుత్వం జరిగిన అవినీతి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తాము విజ్ఞప్తి చేస్తున్నట్లు జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు బత్తెన మధుబాబు తెలిపారు. వైసిపి హాయంలో పరకామణిలో డాలర్ల దొంగతనంపై జరిగిన వైనం, దానిపై పూర్తి విచారణ చేయాలని భాను ప్రకాష్ రెడ్డి కోర్టు ద్వారా పోరాడుతుంటే ఆయనపై బెదిరింపులకు దిగడం, ఒత్తిళ్లు తీసుకురావడం జరుగుతోందని, తనకు ప్రాణహాని ఉందని భాను ప్రకాష్ రెడ్డి హైదరాబాద్లో జరిగిన ఆధ్యాత్మిక మేధావుల సంయుక్త సమావేశంలో చెప్పడం విషయంలో కామంతా భాను ప్రకాష్ రెడ్డికి హిందూ సంఘాలు వెన్నంటే ఉంటామని స్పష్టం చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వెంకట్ రాయల్, హిమవంత్, సాయి, ఈశ్వర్, హరి, వేణు రాయల్, నిర్మలమ్మ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

భానుప్రకాష్ రెడ్డిపై సిబిఐ విచారణ చేయాలి.. తిరుమల పరకామణిలో డాలర్ల అపహరణ చేసిన రవికుమార్‌ను టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి 5 కోట్ల రూపాయలు డిమాండ్ చేశాడని మాచర్ల శ్రీనివాసులు అనే వ్యక్తి ఆరోపించిన అంశంపై పూర్తిస్థాయి విషయాలను బహిరంగపరచడానికి సిబిఐ దర్యాప్తు చేయాలని వైసీపీ నాయకులు ఆరే అజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఈ మేరకు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీవారికి కాపలాదారుడుని అని చెప్పుకునే భాను ప్రకాష్ రెడ్డి కోర్టులో కేసు వేయడం, మళ్లీ వాటిని ఉపసంహరించుకోవడం ఎందుకు చేస్తారో వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. తమకు భాను ప్రకాష్ రెడ్డిపై ఎటువంటి వ్యక్తిగత కక్షలు లేవని స్పష్టం చేశారు. నిజా నిజాలు నీకు తెలుసా అంటే సిబిఐతో దర్యాప్తు చేయిస్తేనే వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వైసీపీ అధికార ప్రతినిధులు పసుపులేటి సురేష్, వాసు యాదవ్, వంశి, గోపి, మహేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో శోభించిన యస్వీయూ పూర్వ విద్యార్థి

ప్రజాశక్తి - క్యాంపస్ : నాగ్‌పూర్‌లోని సిఎస్ఐఆర్ - నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్, డాక్టర్ ఎస్. వెంకట మోహన్‌కు పర్యావరణ శాస్త్ర రంగంలో రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్-విజ్ఞాన్ శ్రీ (2025) అవార్డును అందుకోవడం పట్ల యస్వీయూ ఉపకులపతి ఆచార్య తాతా నరసింగరావు ఆనందం వ్యక్తం చేశారు. యస్వీయు ఇది గర్వకారణమని వైస్-ఛాన్సలర్ పేర్కొన్నారు. వెంకట మోహన్ యస్వీయూ నుండి బి.టెక్., ఎం.టెక్.,పిహెచ్.డి. పూర్తిచేశారని, ఆయన యస్వీయు మాజీ వైస్-ఛాన్సలర్ ఆచార్య జయరామరెడ్డి కుమారుడని, తండ్రి విద్యా, పరిశోధన వారసత్వాన్ని కొనసాగిస్తూ, భావి పరిశోధకులకు స్ఫూర్తినిచ్చారని విసి పేర్కొన్నారు.

కోటి సంతకాలతో ప్రజా ఉద్యమం


సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : కోటి సంతకాలతో కూటమి కుట్రలను తిప్పికొడదామని, వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందామని వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటగిరి మున్సిపాలిటీలోని 8 వార్డుల పరిధిలో సోమవారం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. జోరు వానలోనూ ఇంటింటికి వెళ్లి మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణ అడ్డుకోవాల్సిన ఆవశ్యకతను వివరించి ప్రజా ఉద్యమానికి మద్దతు కూడగట్టారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. జగనన్న పాలనలో ప్రజల సంక్షేమం ప్రజల ముంగిటికి చేరిందన్నారు, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల కలలను చిదిమివేసే ప్రయత్నం చేస్తోందన్నారు. వైద్యాన్ని పేదల నుండి దూరం చేసే కుట్రలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కోడూరు కల్పలత, మున్సిపల్ చైర్ పర్సన్ నక్కా భానుప్రియ, మున్సిపల్ వైస్ చైర్మన్ సేతు రాశి బాలయ్య, కౌన్సిలర్ ఆది శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి వైసిపి ప్రచార విభాగం ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - క్యాంపస్ : వైఎస్ఆర్ సిపి ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీ డా గురుమూర్తి, తిరుపతి సమన్వయ కర్త భూమన అభినయ్, మేయర్ శిరీష, ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ బాబు, టౌన్ బ్యాంకు చైర్మన్ జయచంద్రా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, నగర అధ్యక్షుడు రవిచంద్ర రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'కోటి సంతకాల ప్రజా ఉద్యమం'లో భాగంగా, ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి బాలాజీ కాలనీలోని లక్ష్మీనారాయణ కళ్యాణమండపంలో ఘనంగా సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఆమోదం పొందగా, వాటిని పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణకు మొగ్గుచూపుతోందని విమర్శించారు. కోటి సంతకాల ఉద్యమం నిర్వహిస్తామని భూమన అభినయ్ రెడ్డి పేర్కొన్నారు. వైద్య విద్యను ప్రైవేటీకరించడం దుర్మార్గం అని చెప్పారు డా మేయర్ డాక్టర్ శిరీష పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, ప్రచార విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరనాథ్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి పావని, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతు మురళీధర్, పెద్ద ఎత్తున విద్యార్థి, యువజన నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాశింకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణం, రాజా వీధి, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ని కలిసి సత్కరించారు. ఎమ్మెల్యే దేవస్థానం నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆడిటర్ శ్రీకంఠి రామ్మోహన్ రావు, పేపర్ అమరయ్య నాయుడు, మంగళ పూర్ గోపాల్, పర్వతాల నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినోత్సవంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపే ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా పంపారని, వీలైనంత త్వరగా గూడూరు ను నెల్లూరు జిల్లాలో కలుపుతారని ఎమ్మెల్యే తెలిపారు. తుపాన్ పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ముఖ్య మంత్రి సహాయ నిధి 16 చెక్కులను లబ్ది దారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల బల్లి భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్ రాజు, శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి రెడ్డి , అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరలో కొత్త కోర్సులకు ఒప్పందం


ఆదిశంకర యూనివర్సిటీ ప్రతినిధులతో రిలయన్స్ గ్రూప్ అన్మోల్ అంబాని, క్రిష షా అంబాని, మిషల్ షాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: రిలయన్స్ గ్రూప్ అన్మోల్ అంబానీ, క్రిష షా అంబానీ, మిషల్ షాలు గూడూరు, ఆదిశంకర యూనివర్సిటీ ప్రతినిధులతో సోమవారం సమీక్షించారు. విద్యా బోధనలో నూతన విధానాల గురించి చర్చించారు. అనిమేషన్ ఇతర కొత్త కోర్సుల ఒప్పందం చేసుకోవాలని ఆలోచిస్తున్నట్లు యూనివర్సిటీ ఫౌండర్ డాక్టర్ వంకి పెంచలయ్య, అంబానీలు ఒక సంయుక్త ప్రకటనలో తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఛాన్సలర్ వంకి అరవింద, వైస్ ఛాన్సలర్ రిజిస్ట్రార్, డిప్యూటీ రిజిస్ట్రార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

సోమనాథ్ దాస్‌కు అవార్డు



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో పరిశోధన, ప్రచురణ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. సోమనాథ్ దాస్, న్యూఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీ తరఫున కోల్‌కతాలోని నేషనల్ లైబ్రరీలోని శ్యామప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో సంస్కృత భాషా అనువాద అవార్డు -2024, నగదు బహుమతి రూ. 50,000/-, మెమెంటోను అందుకున్నారు. ప్రముఖ ఒడియా రచయిత డా.బ్రజమోహన్ మొహంతి రాసిన ప్రసిద్ధ ఒడియా నవల "లలిత లవంగ్ లతా"ను అనువదించడం ద్వారా డా.దాస్ ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఈ పుస్తకాన్ని డా.దాస్ సంస్కృతంలోకి అనువదించారు. ఈ గ్రంథం 11వ శతాబ్దపు ప్రసిద్ధ గేయ కవిత "శ్రీ గీత గోవిందం" రచయిత శ్రీజయదేవ జీవితం ఆధారంగా "లలిత లవంగ లత" అనే ప్రసిద్ధ నవల 1982లో ప్రచురించబడింది. వర్సిటీ వీసి ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి కేంద్ర సాహిత్య అకాడమీ నుండి ఈ సుప్రసిద్ధ సంస్కృతభాషా అనువాద అవార్డును అందుకున్నందుకు డా.దాస్‌ను అభినందించారు. సాహిత్య అకాడమీ నుండి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును సాధించినందుకు అధికారులు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు డా.దాస్‌ను అభినందించారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్లు

- ఎండ, వానల్లో ప్రయాణికుల అవస్థలు
- అభివృద్ధి చేయాలని కోరుతున్న ప్రయాణికులు



ప్రజాశక్తి - బాలయపల్లి : ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల తాకిడికి తగ్గట్టుగా మండలంలో పదికి పైగా బస్ షెల్టర్లు ఏర్పాటు చేసి ఉండగా నేడు అవి నిరుపయోగంగా మారాయి. గతంలో ఎంపి గ్రాంటు, పంచాయతీల నిధులతో బస్ షెల్టర్లు ఏర్పాటు చేశారు. ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు బస్సులకోసం వేచి ఉండేందుకు ఎటువంటి అవస్థలు పడకుండా ఉండాలన్న ఉద్దేశంతో బస్ షెల్టర్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే మండలంలోని వెంకటరెడ్డి పల్లి, రామాపురం, అక్కసముద్రం, సంగవరం, పెరిమిడి, బైరవరం, బాలాయపల్లి ఇంకా పలు చోట్ల ఉన్న బస్ షెల్టర్లు శిథిలావస్తలో ఉండటంతో లోనికి వెళ్లేందుకు ప్రయాణికులు జంకుతున్నారు. బస్సులకోసం బస్ షెల్టర్ బయతే వేచి చూస్తున్న పరిస్థితి నెలకొంది. లక్షల రూపాయల నిధులతో నిర్మించిన బస్ షెల్టర్లు ఇపుడు మందు బాబులకు అడ్డాగా మారాయని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. బస్సు షెల్టర్లు శిథిలావస్థకి చేరి శాబు పెచ్చులు ఊడి పడుతుండడంతో ప్రయాణికులు లోపలికి వెళ్లేందుకు సాహసించడం లేదు. నాయకులు, అధికారులు బస్ షెల్టర్లపై శ్రద్ధ చూపకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వృద్ధులు, గర్భవతులు, బాలింతలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వేచి చేసేందుకు ఇబ్బందిగా ఉండటంతో ప్రయాణికులు ఆటోలను, మ్యాజిక్ వ్యాన్లను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి బస్ షెల్టర్లను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రయాణికుల అవస్థలు తగ్గించాలని కోరుతున్నారు.

బలిజ భవనం పూర్తి చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : బలిజ భవన్ పూర్తి చేసే ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బలిజల అభ్యున్నతికి కృషి చేయాలని పలువురు నేతలు పేర్కొన్నారు. సోమవారం బలిజ భవన డెవలప్మెంట్ అద్వర్యంలో లోటస్ గ్రాండ్ హోటల్‌లో బలిజ భవన నిర్మాణంకోసం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్య అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతిలో పేద బలిజ విద్యార్థులు హాస్టల్ వసతిలేక ఇబ్బందులు పడుతున్నారని, పేద బలిజలు కూడా పెళ్లిళ్ల ఫంక్షన్లు చేసుకోడానికి అధికమొత్తంలో ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనుక భవన నిర్మాణం త్వరితగతిన నిర్మాణం చెయ్యడానికి కమిటీ ప్రయత్నిస్తోందన్నారు. తెలుగుదేశం రాష్ట్ర నాయకులు కోడూరు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ తిరుపతిలో బలిజ కులస్తులు ఏ సమస్య ఎదురైనా కమిటీకీ తెలియజేస్తే న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కారక్రమంలో కమిటీ సభ్యులు గుట్టా నాగరాజా రాయల్, ఆర్పిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డి శేఖరరాయలు, బుల్లెట్ రమణ, దేపూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్నా పట్టించుకోరా..?



ప్రజాశక్తి - రేణిగుంట : ఇటీవల కురుస్తున్న వర్షాలకు రేణిగుంట పట్టణంలో అన్నిచోట్ల పారిశుధ్యం పడకేసిందని స్థానికులు ఆరోపించారు. అసలే వర్షాకాలం, పందులు, కుక్కలు వ్యర్థాలను ఇండ్ల ముందర తీసుకురావడంతో భరించలేని దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఎక్కడ రోగాల బారిన పడతామోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. పోస్ట్ ఆఫీస్ వీధి, బుగ్గ వీధి, షాది మహల్, ఎంపీడీవో కార్యాలయం వద్ద పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉందని, పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పోలీసులకు రెయిన్ కోట్‌లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో గూడూరు డీఎస్పీ గీతా కుమారి చేతుల మీదుగా సోమవారం పోలీస్‌లకు రెయిన్ కోట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వారి విధులను సమర్ధవంతంగా నిర్వహించడానికి సిబ్బందికి రైన్ కోట్‌లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ - 2025

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు "విజిలెన్స్.. మన భాగస్వామ్య బాధ్యత" అనే కేంద్ర ఇతివృత్తంతో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ – 2025ను నిర్వహిస్తోంది. విశ్వవిద్యాలయ సమాజంలోని అన్ని వర్గాలలో సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనం, నైతిక బాధ్యత విలువలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభ సమావేశం సోమవారం సంస్కృత విశ్వవిద్యాలయంలోని రామరంజన్ ముఖర్జీ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్. కృష్ణ మూర్తి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎంవిఎస్. స్వామి, ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, రిజిస్ట్రార్ కెవి.వెంకట నారాయణరావు, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ సత్యనారాయణ ఆచార్య, కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. చారుకేష్, అదనపు కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. శేఖర్ రెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పిహెచ్‌డి పండితులు పాల్గొన్నారు.

వైసిపి శవ రాజకీయాలు మానుకోవాలి : శాప్ ఛైర్మన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కర్నూలు ఘటన రాష్ట్రవ్యాప్తంగా అందరినీ కలిసి వేసిందని, కానీ వైసీపీ ఈ ఘటనను కల్తీ మద్యం వలనే జరిగిందని కుట్రపూరితంగా మార్పు చేసే ప్రయత్నం చేస్తూ శవ రాజకీయాలకు పూనుకుందని, ఆ దిశగా తన సొంత మీడియా ద్వారా ప్రచారాలు చేయడం దారుణమని, ఇకనైనా ఇటువంటి చర్యలు మానుకోవాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు సూచించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో రవి నాయుడు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కర్నూలు ఘటనపై అందరూ విచారణ వ్యక్తం చేస్తుంటే రాజకీయ లబ్ధి కోసం విష ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇకపై కూడా అసత్య ప్రచారాలు చేసుకుంటూ పోతే వైసీపీకి ఈసారి ఒక సీటు కూడా రాదని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్ యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు హేమంత్ రాయల్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి తోటవాసు రాయల్, రంజిత్ నాయుడు, లోకేష్ రాయల్, మధు తదితరులు పాల్గొన్నారు.

గోపీని సత్కరించిన ముస్లిం నేతలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు ప్రమాణం చేసిన గాదిపాకుల గోపీనాథ్ ను పట్టణానికి చెందిన ముస్లిం మైనారిటీ సోదరులు సోమవారం ఘనంగా సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అండగా ఉంటారనడానికి గోపీనాథ్ నిదర్శనమన్నారు. కార్యక్రమంలో షాకిర్ అలీ, ఖాదర్ బాషా, షఫీ, ఖలీల్, ఫ్రూట్ మీర్జా, షేక్ జహీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కన్నలి చెరువు నీటిని అన్ని గ్రామాలకు అందించాలి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు) మండలంలోని, పెద్దకన్నలి గ్రామ చెరువు ద్వారా ఆయకట్ట కింద సుమారు 1550 ఎకరాలకు సాగునీరు అందుతుందని తొట్టంబేడు మండలం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు, వైయస్సార్ పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడులు పేర్కొన్నారు. కానీ మెగా సంస్థ ద్వారా నిర్మించిన జాతీయ రహదారిలో లోటుపాట్లు వల్ల ప్రస్తుతం కుమ్మలగుంట, చిన్న సింగమాల, పొయ్య, పొయ్య కొత్తూరు, లింగమ నాయుడు పల్లి గ్రామాలకు మాత్రమే సాగునీరు అందుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా మెగా సంస్థ వారు పెద్ద కన్నలి చెరువు నుంచి మిగతా గ్రామాలకు కూడా సాగునీరు అందేలా మార్పులు చేయాలని కోరారు.

పుదూరు లక్ష్మణ్ రెడ్డికి నివాళి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్, వైసీపీ సీనియర్ నాయకులు పుదూరు లక్ష్మణ్ రెడ్డి సోమవారం అనారోగ్యం కారణంగా మరణించారు. ఆయన మృతదేహానికి శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కర్మక్రియలు జరుపుకునేందుకు వసతి ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, ఆరెపల్లి, రంగంపేటలో చాలా రోజులుగా గ్రామ ప్రజలు కర్మక్రియలు జరుపుకొనుటకు సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ ఏరియాలో ఉన్న పాడు బడిన బిల్డింగ్‌కి మరమ్మతులు చేస్తే ఇక్కడ అనుకూలమైన ప్రదేశమని గ్రామ పెద్దలు నాగిరెడ్డి, ఆకుల మునిరాజ, మాజీ సర్పంచ్ కలివేటి చంద్రమౌళి, పచ్చిపాల కిషోర్లు ఏనుగుల భీభత్సం చేసిన ప్రదేశాన్ని పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే రంగంపేటలో కర్మక్రియలు జరుపుకొనే ప్రదేశాన్ని పరిశీలించి సంబంధిత అధికారులను పిలిచి పాడుబడిన బిల్డింగ్‌కి మరమ్మతులు చేయాలని ఆదేశించారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో ప్రకాశం భవనంలోని ఉపాధ్యక్షులు (వైస్ ప్రిన్సిపల్) చాంబర్‌లో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రం సేవలు సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం, బుధవారం రోజులలో కూడా పొడిగించడం జరిగిందని ఆ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుధారాణి వెల్లడించారు. ఆధార్ నమోదు మోడిఫికేషన్ కేంద్రాన్ని సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం, బుధవారం రెండు రోజులపాటు నిర్వహిస్తామని, ఎవరైనా ఇంకా ఆధార్ అప్డేట్ చేసుకోవాల్సి ఉంటే వర్సిటీ సిబ్బంది ఈ రెండు రోజుల్లో ప్రకాశం భవనంలోని వైస్ ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో పూర్తి చేసుకోవాలని సూచించారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సిసి

ప్రజాశక్తి - క్యాంపస్ : బెంగళూరులో జరిగిన ప్రతిష్టాత్మక ప్రీమియర్ ఈక్వెస్ట్రియన్ లీగ్ 2025లో డ్రస్సేజ్ పోటీలో తిరుపతిలోని 2వ ఆంధ్ర రీమౌంట్, వెటర్నరీ ఎన్‌సిసి యూనిట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న క్యాడెట్ ఆనంద్ రజత పతకాన్ని సాధించారు. ఈ ఈవెంట్‌లో దేశవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి రైడర్లు వివిధ ఈక్వెస్ట్రియన్ విభాగాలలో అసాధారణ ప్రతిభ, నైపుణ్యం, క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారని అధికారులు పేర్కొన్నారు. ఈ విజయం ఈక్వెస్ట్రియన్ క్రీడలలో రాణించాలనుకునే యువ క్యాడెట్‌లకు ప్రేరణగా పనిచేస్తుందని, భవిష్యత్ నాయకులు, క్రీడా సాధకులను తీర్చిదిద్దడంలో ఎన్‌సిసి నిరంతర శ్రేష్ఠతను సూచిస్తుందని తెలిపారు.

వైద్య శిబిరం తనిఖీ

ప్రజాశక్తి - వాకాడు: భారీ వర్షాలనేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ వాకాడు మండలంలో పర్యటించిన సంగతి తెలిసిందే. కలెక్టర్ సూచన మేరకు సోమవారం తూపిలి పాలెం, ఎస్టీ కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆ వైద్య శిబిరాన్ని తాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్ అకస్మికంగా తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్యులకు, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యులకు సహకరించాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం తూపిలి పాలెం గ్రామానికి సమీపంలోని బంగాళాఖాతం సముద్రాన్ని తహశీల్దార్, ఎంపీడీవోలు పరిశీలించారు. సముద్రంలో చేపల వేటకు ఎవరూ వెళ్లొద్దని హెచ్చరించారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి - చంద్రగిరి: ఆంధ్ర ఇంజనీర్ కంపెనీ, ఎన్‌సిసికి సంబంధించిన తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, బుచ్చి నాయుడుపల్లె పంచాయితీని దత్తత తీసుకుని, క్యాడెట్స్, ఎన్‌సిసి అధికారుల ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వర్ణముఖి నదిని శుభ్రపరచడం, గ్రామంలో రోడ్లు, పరిసర ప్రాంతాలు, పంచాయతీ కార్యాలయం దగ్గర, ఎంపీపీ పాఠశాల దగ్గర, వాటర్ ట్యాంక్ దగ్గర శుభ్రపరచారు. ఈ కార్యక్రమంలో కల్నల్ కడియాల శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శీల నిర్మాణంతోనే సమాజ రక్షణ

ప్రజాశక్తి -ఏర్పేడు : తల్లి తండ్రులు పిల్లల్లో శీల నిర్మాణం ద్వారా సమాజాన్ని రక్షించాలని సైకాలజిస్ట్ డా. ఎన్ బి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎస్ ఓ ఎస్ పిల్లల గ్రామంలో పిల్లల శీల నిర్మాణంలో తల్లుల పాత్రపై అవగాహన కల్పిస్తూ, ఆధునిక సమాజంలో నైతిక విలువలు క్షీణించడం వల్ల అవినీతి, అక్రమాలు, లంచగొండితనం, అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయన్నారు. కొందరు యువకులు వ్యసనాలకు బానిసలై సమాజానికి హాని చేస్తున్నారన్నారని, కొందరు ఉద్యోగుల్లో లంచగొండి తనం పెరిగిపోయి సామాన్యులను దోచుకుంటున్నారన్నారు. బాల్యం నుంచి విలువలు నేర్పకపోవడమే ఇందుకు కారణమని తెలిపారు. తల్లి తండ్రులు బాల్యం నుంచే పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం, సామాజిక స్పృహ పట్ల శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ, మునిరత్నం, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని డెలివరీ వార్డులో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, టౌన్, వెస్ట్ క్లబ్స్ సేవా కార్యక్రమాలలో భాగంగా బాలింతలకు పౌష్టికాహారం, పిల్లలకు దుస్తులు అందచేశారు. ఈ కార్యక్రమానికి టౌన్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ యాదవ్ దాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా టౌన్ క్లబ్ ప్రెసిడెంట్ శీను యాదవ్ మాట్లాడుతూ పేదలకు సేవా చేయడంలోనే సంతృప్తి అని తెలిపారు. వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.రావు మాట్లాడుతూ పేద మహిళలకు సహాయం చేసేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు ముందుంటారని పేర్కొన్నారు. .ఈ కార్యక్రమంలో వైజేపీ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ సుధాకర్, ట్రెజరర్. గోపినాథ్ రెడ్డి, టౌన్ క్లబ్ సెక్రటరీ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సేవలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పోలీస్ స్మారక దినోత్సవం సందర్భంగా గూడూరు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ స్కూల్ బాలికలకు పోలీస్ శాఖ విధులు, సేవలపై అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ డెస్క్, మహిళల సహాయ కేంద్రం, వైర్‌లెస్ సెట్, లాక్–అప్, స్టేషన్ రికార్డులు, డయల్ 100, ట్యాబ్స్ వంటి విభాగాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సీఐ శేఖర్ బాబు, ఎస్. ఐ.మనోజ్ కుమార్ , సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కాటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నెలవాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను స్థానిక తహశీల్దారు వెంకట రత్నమ్మ పరిశీలించారు. డిజిటల్ అసిస్టెంట్ పావని ఆధ్వర్యంలో పలువురు ఆధార్ నమోదు చేసుకున్నారు. ప్రధానంగా కొత్త ఆధార్ కార్డు నమోదు, ఆధార్ చిరునామా, పేర్లు తప్పొప్పులు సరి చేయడం వంటివి నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ నమోదు ప్రక్రియను రత్నమ్మ పరిశీలించారు.

కార్తీక శోభతో సదాశివేశ్వరాలయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర ఆలయంలో భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం శ్రీ సదాశివేశ్వరునికి అభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిగాయి. సాయంత్రం 6 గంటలకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణాన్ని కార్తీక దీపాలతో కాంతిమయం చేశారు.

క్రైం న్యూస్

తెలుగుగంగ కాలువలో ఇద్దరు గల్లంతు.. ఒకరి మృతదేహం లభ్యం


గల్లంతైన వారికోసం గాలిస్తున్న పోలీసులు, లభ్యమైన బాలుడు మహిత్ మృత దేహం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కుంభాకం సమీపంలో తెలుగు గంగ కాలువలో పడి ఓ యువకుడు, ఆరేళ్ల బాలుడు గల్లంతయ్యారు. ఈ సంఘటన వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల సరిహద్దులో జరిగింది. వరదయ్యపాళెం మండలానికి చెందిన ఇరిగేషన్ శాఖ ఏఈ బాబు తన కారు కడిగేందుకు కారు డ్రైవర్ షరీఫ్ అలియాస్ చిట్టి (40), మనవడు మహిత్(6)తో కలిసి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఉబ్బలమడుగు సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్దకు వెళ్లారు. కాలువలోని ర్యాంపులో కారు దించి కడుగుతుండగా బాలుడు మహిత్ కాలుజారి కాలువలోకి పడ్డాడు. బాలుడిని కాపాడేందుకు కాలువలోకి దూకిన బాలుడి తాత ఏఈ బాబు నీటి ప్రవాహానికి కొట్టుకు పోయారు. ఇది గమనించిన డ్రైవర్ షరీఫ్ వారిద్దరిని కాపాడేందుకు తానుకూడా కాలువలోకి దూకాడు. ఈ ఘటనలో డ్రైవర్ షరీఫ్, బాలుడు మహిత్ నీటి ప్రవాహంలో కొట్టుకు పోయారు. ఏఈ బాబు అదృష్టవ శాత్తు చెట్టుకొమ్మను పట్టుకుని వేలాడుతుండగా అటుగా వెళుతున్న గిరిజన మత్స్యకారులు కాలువలోకి వల విసిరి బాబును రక్షించారు. కాగా గల్లంతైన షరీఫ్, మహిత్‌ల కోసం పోలీసులు, గాలించగా సోమవారం మహిత్ మృత దేహం దొరికింది. షరీఫ్ కోసం గాలిస్తున్నారు. ఆదివారం నుండి తహశీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్ వారి బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం.. ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు



ప్రజాశక్తి - పుత్తూ రు, మంగళం: తిరుపతి జిల్లా, పుత్తూరు అటవీ ప్రాంతం, నారా యణవనం వద్ద 19ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్ కు చెందిన ఎఆర్ఎస్ఐ ఎన్.ఈశ్వర్ రెడ్డి టీమ్ ఆదివారం కైలాసకోన నుంచి కూంబింగ్ చేపట్టింది. వీరు పుత్తూరు అటవీ పరిధిలోని నారాయణవనం సమీపంలోని సింగిరకోన రోడ్డు, కన్నికలమ్మ ఆలయం సమీపానికి చేరుకోగా, అక్కడ ఇద్దరు వ్యక్తులు కనిపించారు. టాస్క్ ఫోర్సు పోలీసులను చూసిన వారు పారిపోవడానికి ప్రయత్నించగా, వెంబడించి చుట్టుముట్టారు. ఆ పరిసర ప్రాంతాల్లో పరిశీలించగా, 19 ఎర్రచందనం దుంగలు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని, పట్టుబడిన వ్యక్తులను అరెస్టు చేశారు. వారిని స్థానికులుగా గుర్తించారు. వారిని, దుంగలతో పాటు తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, ఎసీఎఫ్ శ్రీనివాస్‌లు విచారించగా, ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఆర్ఎస్ఎస్ కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి ఐదేళ్ల జైలు శిక్షతో పాటుగా ఒక్కొక్కరికి ఆరు లక్షల రూపాయల జరిమానాలను విధించినట్లు టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బారాయుడు తెలిపారు. 2017లో తిరుపతి పెరుమాలపల్లి, టియన్ పాలెం నిషేధిత రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు అడవిలోకి ప్రవేశించి తమిళనాడు వేలూరు జిల్లాకు చెందిన సుబ్రమణి సతీష్ కుమార్, తిరువన్నామలైకు చెందిన కుల్లయన్ వెంకటేష్‌లు పట్టుబడినట్లు తెలిపారు. ఈ మేరకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగురి అమర నారాయణ ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుకు సంబంధించి పగడ్బందీ ఆధారాలను కోర్టు వారికి సమర్పించడం తో ఈ శిక్షను ఖరారు చేసినట్లు చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు వీరిరువురిని నెల్లూరు సెంట్రల్ జైలుకు అప్పజెప్పడం జరిగిందన్నారు.